

మహంకాళి దేవాలయం వద్ద సేవా కార్యక్రమాల్లో క్లబ్ సికింద్రాబాద్ సభ్యులు

సామాజిక సేవతోనే సంతృప్తి

కవాడిగూడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవతోనే సంతృప్తి లభిస్తుందని వాసవిక్లబ్ సికింద్రాబాద్ నేతలు పిప్పల ఆశోక్‌కుమార్, మారిశెట్టి ఉపేందర్, విశ్వేశ్వర్‌రావు, గుండా శ్రీనివాస్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని బోనాల జాతరను పురస్కరించుకొని సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి దేవాలయం వద్ద వాసవి క్లబ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు 80వేల మందికి ఉచితంగా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈసందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఆధ్యాత్మిక సేవతోపాటు పలు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహించడంలో సంతృప్తి లభిస్తోందన్నారు.

కొవ్వలి లక్ష్మీనరసింహారావు సేవలు మరువలేం

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు కృషి చేసిన సాహితీవేత్త కొవ్వలి లక్ష్మీనరసింహారావు అని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు శీర్షిక కార్యక్రమాల పరంపరలో భాగంగా సోమవారం కొవ్వలి లక్ష్మీనరసింహారావు యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో వేయి పైగా రచనలు చేసిన వారు ఒక్క కొవ్వలి లక్ష్మీనరసింహారావు మాత్రమేనన్నారు. తెలుగు సాహిత్య వ్యాప్తికి ఎంతో కృషి చేశారన్నారు. జర్నలిస్ట్ జయసూర్య, నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, గాయని సీత పాల్గొన్నారు.


లక్ష్మీనరసింహారావుకు నివాళులర్పిస్తున్న దామోదర్‌గుప్తా, జనార్దనమూర్తి

బ్రోచర్ ఆవిష్కరణ

ముషీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ పరికరాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ తెలిపారు. సోమవారం ముషీరాబాద్‌లోని అర్యవైశ్య భవన్‌లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. దీనికి ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రామ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా భరత్‌గౌడ్ హాజరయ్యారు. దివ్యాంగుల సహాయ పరికరాల పంపిణీ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 16వ తేదీ నియోజకవర్గంలోని కవాడిగూడ తాళ్లబస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీకి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగుల సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు ఎంపిక చేసే శిబిరానికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ రమేష్ ఎరం, బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వర్‌రావు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, బీజేపీ రాష్ట్ర నాయకులు బిల్ల కనకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీబీని నియంత్రించవచ్చు

● వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీ హెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ ఎం. మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ బాకారం బస్తీ దవాఖానా వద్ద టీబీ ముక్త్ అభియాన్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీబీని ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బస్తీ దవాఖానా డాక్టర్ హసీనా, ముషీరాబాద్ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎం విజయకుమారి, నాయకులు జాఫర్, జయకుమార్, లింగాల శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను పెంచాలి : తెలంగాణ ఈబీసీ సంఘం

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల డిమాండ్లకు అనుగుణంగా నూతన కళాశాల వసతిగృహాలను పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఈబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోట్ల ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్న కళాశాల వసతిగృహాలకు అదనపు సీట్లు మంజూరు చేస్తూనే అనుబంధ నూతన వసతిగృహాలను ఏర్పాటు చేయాలని పలుమార్లు బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా నేటి వరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఉన్నతాధికారులు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి వెళ్లకుండా సమస్యను పరిష్కరించకుండా పేద, బడుగు, బలహీనవర్గ విద్యార్థుల్లో ప్రభుత్వం పట్ల చెడ్డపేరు తెస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో న్యాయవాదులు సతీష్, హరికృష్ణ, సంఘం కోశాధికారి రాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు యాజమాన్యం కృషి చేస్తోందని తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు పెన్షనర్ల సంఘం ఆవిర్భావ జనరల్ బాడీ సమావేశం జరిగింది. గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల ఇబ్బందుల పైర్లన్ దృష్టికి తీసుకెళ్లామని చంద్రశేఖర్ అన్నారు. పెంషన్ సమస్య, ఆరోగ్య బీమా తదితర అక్షులపై యాజమాన్యంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కట్ల ప్రసాద్, వెంకటేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, గోపాల్‌రావు, రవికాంత్, గణపతి, హెగ్డే, రాజారావు, సుదకర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

దేశ్‌ముఖ్ ఆస్పత్రిలో.. దోపిడీ దేఖో!

● కార్పొరేటు స్థాయిలో బిల్లుల వడ్డన
● గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ బాధిత కుటుంబాల గగ్గోలు
● వాటిని చెల్లించేందుకు అప్పుల పాలు
● కనీస సౌకర్యాలూ.. కొరతే
● కూర్చునేందుకు సరిపడా కుర్చీలేవీ?
● అరుగులు, గద్దెలపై సేదదీరుతున్న రోగి సహాయకులు
● ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో పలు సేవలు



రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొనసాగుతున్న దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి గతంలో పేదల పాలిట పెన్నిధి అన్నట్లుగా ఉండేది. నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందింది. బసవతారకం కంటే తక్కువ ఖర్చులకే క్యాన్సర్ సేవలని ప్రారంభోత్సవంలో చెప్పింది. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే అందుకు భిన్నంగా ఉన్నాయి. కార్పొరేట్ స్థాయిలో బిల్లులు వేసి ముక్కుపిండి మరి వసూలు చేస్తున్నారు. ఈ హాస్పిటల్‌కు ఎందుకు వచ్చామా అని రోగి కుటుంబసభ్యులు ఆవేదన చెందే పరిస్థితి ఏర్పడిందనే విమర్శలు ఉన్నాయి. ఇక మౌలిక సదుపాయాల విషయానికొస్తే.. కనీసం రోగి సహాయకులు కూర్చునేందుకు సరిపడా కుర్చీలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శలు ఉన్నాయి.

దుర్గాబాయిదేశ్‌ముఖ్ ఆస్పత్రికి నగర నలుమూలలతో పాటు జిల్లాల నుంచి వైద్య సేవలకు వస్తుంటారు. ప్రస్తుతం ఇక్కడకు వచ్చాక ఆసుపత్రి యాజమాన్యం చెప్పే ధరలు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఉండటం చూసి అవాక్కవుతున్నారు. కాని వాస్తవంగా అందుకు అనుగుణంగా మౌలిక వసతులు లేవన్నది విమర్శలు వాదన. కనీసం రోగుల సహాయకులు కూర్చునేందుకు ఆసుపత్రి ఆవరణలో సరిపడా కుర్చీలు లేవు. అరుగులు, గద్దెలపై కూర్చోవడం, నిద్రించడం కనిపిస్తున్నది. తాగునీరు సౌకర్యం సంగతి సరేసరి. అరకొర సేవల నడుమ ఆసుపత్రిలోని అన్ని సేవలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం విడ్డూరం. ఈ యాజమాన్యం ఎక్కువ రేట్లు వసూలు చేస్తూ ట్రస్ట్ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని పేషంట్లు, వారి బంధువులు విమర్శిస్తున్నారు.

పలు విభాగాలు ప్రైవేట్ పరం

ఆసుపత్రిలోని పలు విభాగాలను డీటీహెచ్ యాజమాన్యం ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది. కేర్ ఆసుపత్రి భాగస్వామ్యంతో కలిసి గుండె సంబంధిత వ్యాధుల సేవలను అందజేస్తోంది. కాని ఈ యాజమాన్యం మాత్రం కార్పొరేట్ ఫీజులను వసూలు చేస్తున్నది.

● దుర్గాబాయి దేశ్‌ముఖ్.. క్యాన్సర్ సెంటర్ ప్రారంభోత్సవ సమయంలో నగరంలోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి కంటే తక్కువ ఖర్చుతో నివారణ సేవలు అందిస్తామని యాజమాన్యం చెప్పింది. ఇప్పుడు అందుకు భిన్నంగా ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పార్కింగ్ 'ఫీ'జులుం

దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆసుపత్రి యాజమాన్యం ఆదాయం పెంచుకునేందుకు గాను రోగుల కోసం వచ్చే వారి బంధువుల నుంచి వాహన పార్కింగ్ పేరిట డబ్బులు వసూలు చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. బైక్‌కి రూ. పది ఇచ్చేంత వరకు లోపలకు పంపడం లేదని పలువురు పేర్కొన్నారు.

పునరుద్ధరణ పనులు సమన్వయంతో చేయాలి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


బతుకమ్మకుంట పనులపై వివిధ అధికారులు, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డితో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

నల్లకుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులపై వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. వర్షం నీరు బతుకమ్మకుంటలో ప్రవేశించడం వల్ల డ్రైనేజీ, మంచినీరు పైప్‌లైన్లలోకి కలవకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, వివిధ శాఖ అధికారులతో కలిసి ఆయన ఈ ప్రాంతాన్ని సందర్శించారు. బతుకమ్మకుంట నీటిమట్టం పెరిగిన వెంటనే ఔట్‌లెట్ నుంచి నీరు సాఫీగా బయటకు వెళ్లేలా పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. బతుకమ్మకుంట నుంచి అంబర్‌పేట ఛేనంబర్ చౌరస్తా మీదుగా జిందాతిలిస్మాత్ నుంచి గంగానగర్ సమీపంలోని డీమార్ట్ వరకు ఉన్న నాలాకు సంబంధించిన విషయంపై అధికారులు చర్యలు తీసుకుంటూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సి.హెచ్.చంద్రమోహన్, హైడ్రా అధికారులు యూసన్, సురేష్, జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ, జలమండలి ఏఈ మజీద్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు మేరా శ్రీరాములు ముదిరాజ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎమ్మెల్యే ముఠాగోపాల్


వినోభా కాలనీలోని నల్లపోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు

ముషీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం వినోభా కాలనీలో గల నల్లపోచమ్మ దేవాలయ బోనాల ఉత్సవాల అలంకరణ పూజా కార్యక్రమాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తలారి శ్రీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే .. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాల అలంకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యుత్ శాఖ, జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని 201 అమ్మవారి దేవాలయాలకు కోటి 7లక్షల 500 రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను శ్రీకాంత్ ముదిరాజ్ సన్మానం చేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు దీనదయాళ్ రెడ్డి, వాజీద్ విభాగం డివిజన్ అధ్యక్షుడు టెంట్ హౌస్ శ్రీనివాస్, పార్టీ నాయకులు ఎయిర్‌టెల్ రాజు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.


ముషీరాబాద్ మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపులో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు

భక్తిశ్రద్ధలతో ఘటం ఊరేగింపు

ముషీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు సోమవారం నిర్వహించారు. ముషీరాబాద్ జలమండలి కార్యాలయంలో గల అమ్మవారి దేవాలయం నుంచి భక్తుల రామ.. ఊరేగింపుగా ముషీరాబాద్ మహంకాళి దేవాలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎద్ద హరిబాబు యాదవ్, సీనియర్ నాయకులు డి. శివముదిరాజ్, శ్రీధర్‌చారి, అలీనందన్‌యాదవ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పూరి నందు, కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ టూల్స్ విక్రేతలపై చర్యలు తీసుకోవాలి

నల్లకుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాలకు పైగా పవర్‌టెక్ టూల్స్ కంపెనీ ప్రత్యేక మోడల్ ప్రొడక్ట్ పేరిట విస్తృతంగా ప్రచారం పొందింది, అయితే తెలుగు రాష్ట్రాలలో తమ కంపెనీ పేరిట నకిలీ టూల్స్ విక్రయిస్తున్నారని కంపెనీ డైరెక్టర్ మహేశ్‌గుప్తా ఆరోపించారు. కొందరు నకిలీ టూల్స్ విక్రయిస్తూ తమ కంపెనీ ఆదాయానికి గండికొడుతున్నారని ధ్వజమెత్తారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన విజయవాడ వన్‌టౌన్‌లో విజయశ్రీ షాపులో విక్రయిస్తే పీఎస్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. సుమారు 25 లక్షల విలువల గల 276 ప్రొడక్ట్‌ను స్వాధీనం చేసుకున్నారన్నారు. తమ షాపు నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనూ నకిలీ టూల్స్ విక్రయిస్తున్నారని ఆరోపించారు. త్వరలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ ఓజా, సేల్స్ మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు ఈవోగా అంజనరెడ్డి బాధ్యతల స్వీకరణ

బర్కత్‌పుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కాచిగూడలోని మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఈవోగా ఎస్.అంజనరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ సమక్షంలో బాధ్యతలు తీసుకున్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి: పీవైఎల్

నల్లకుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించి ప్రజలు అనారోగ్యం బారిన పడుతుంటే ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నాయని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్ డీఎంహెచ్ఓ జె.వెంకన్నను కలిసి ఈ విషయంపై వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. బస్తీ దవాఖానాలలో, పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఈ వర్షాలు అదును చూసుకుని ప్రైవేట్ ఆస్పత్రులు టెస్టులు, మందుల పేరుతో ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.


తన జీవితంపై రచించిన 'ప్రజల కడే నా ఆత్మకథ' పుస్తకాన్ని సోమవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవికి హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ బహుకరించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

భక్తులు సహకరించాలి

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణంలోని పలు ఆలయాలకు వెండితొడుగుల ఏర్పాటుకు భక్తులు ధన, వస్తు రూపేణ సహకరించాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం, ఆలయ ఫౌండర్ నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ముఖ్యకర్తలు బుర్రా లక్ష్మీనరసింహ్మ కోరారు. సోమవారం సాయంత్రం వారు మాట్లాడారు. ప్రస్తుతం ఆంజనేయస్వామి దేవాలయం, భవాని శంకరస్వామి, భువనేశ్వరీ మాత గర్భాలయంలో వెండి మకరతోరణం, గర్భాలయ ద్వారానికి చౌకోడు తలుపులకు సగానికి తొడుగు, స్వామి వారి ఆరాధనకు కావాల్సిన వివిధ వస్తువులు చేయించడానికి 250 కిలోల వెండి అవసరమవుతుందన్నారు. వెండి వస్తువులు, నగదు, డీడీ లేదా చెక్కు, క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించి తగినవిధంగా రసీదు పొందాలన్నారు.


ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ

ఫీజు బకాయిలు రూ. 6 వేల కోట్లు విడుదల చేయాలి

● ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి ఎంపీ ఆర్.కృష్ణయ్య వినతి

రాంనగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలు 6 వేల కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కోరారు. సోమవారం సచివాలయంలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఫీజుల కోసం బ్యాంకు ట్రస్ట్ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, వంద బీసీ కాలేజీ హాస్టల్స్ మంజూరు చేయాలని, 120 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలని, రెసిడెన్షియల్ సీట్లను 30 శాతం పెంచాలన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరులకు తెలిపారు. ఫీజుల బకాయిలు విడుదలలో జాప్యం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తమ డిమాండ్లపై వెంటనే చర్యలు చేపడతామని చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, జెల్లపల్లి అంజి, రాందేవ్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచండి: ఆర్.కృష్ణయ్య

కర్నూల్ : బీసీ గురుకుల పాఠశాలల సంఖ్యను పెంచాలని బీసీ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం మాసాబ్‌ట్యాంక్ సంక్షేమ భవన్ ముందు పలువురు గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. అదనంగా 119 బీసీ గురుకులాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


కాచిగూడ తుల్జాభవన్‌లో నిర్వహించిన యాగంలో పాల్గొన్న మంత్రి సురేఖ

దేవాలయ భూములను పరిరక్షిస్తాం

● మంత్రి కొండా సురేఖ

బర్కత్‌పుర, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్యాక్రాంతమైన దేవాలయ భూములను పరిరక్షిస్తామని మంత్రి కొండా సురేఖ అన్నారు. సోమవారం కాచిగూడ తుల్జాభవన్‌లో తెలంగాణ దీనదయాళ్ వైదిక అర్చక సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వంచకుండాత్మక చండీ, కుబేర, పాశుపత యాగానికి హాజరైన ఆమె ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఆకాంక్షిస్తూ లోకకల్యాణం కోసం ఈ యాగం నిర్వహిస్తున్నారన్నారు. దేవాదాయ శాఖను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామన్నారు. ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండేందుకు ఇలాంటి యాగాలు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, తెలంగాణ దీనదయాళ్ వైదిక అర్చక సంఘం అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌శర్మ, వెంకటాద్రి స్వామి, రామలింగేశ్వరశర్మ, నాగదక్షిణ మూర్తి, అమరేశ్వరశర్మ, ఫణికుమార్‌శర్మ, గోపికృష్ణమాచార్యులు, హరికిషన్‌శర్మ, కొండూరు విశాల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట డివిజన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే వెంకటేష్

అంబర్‌పేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. పటేల్ నగర్‌లో రూ 4లక్షలతో చేపట్టిన డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అంబర్‌పేటలో జరిగే అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.అనంతరం బిలాల్ మసీద్ బస్తీ, పటేల్ నగర్‌లో పాదయాత్ర చేసి బస్తీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్, లత, వంజరి నాగరాజు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి సహకరించాలి

చిక్కడపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభివృద్ధి పనుల అమలు విషయంలో వివిధ విభాగాల ప్రభుత్వాధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి డివిజన్ అభివృద్ధికి సహకరించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావనివినయ్ కుమార్ సూచించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సీవరేజ్, మంచినీటి పైప్ లైన్ నిర్మాణ పనుల విషయంలో వాటర్‌బోర్డ్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం మధ్య సమన్వయలోపం కారణంగా ప్రజాభివృద్ధిపనులు ఆగిపోకుండా చూసుకోవాలన్నారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. సీవరేజ్, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం సుందర్యంగా సమన్వయంతో రెండు విభాగాలు పనిచేయాలన్నారు. సమావేశంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు ఎ. వినయ్‌కుమార్ పాల్గొన్నారు. వాటర్‌బోర్డ్ డీజీఎం కార్తీకరెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ఏఈ అబ్దుల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



శాకాంబరి దేవిగా దర్శనం

రేణుకా ఎల్లమ్మ అమ్మవారు శాకంబరి దేవి రూపంలో దర్శనమిచ్చారు. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్ నగర్‌లో ఉన్న ఆలయంలో భక్తులు బోనాలు మనసారా సమర్పించారు. ఈ సందర్భంగా శాకాంబరిదేవిగా అలంకరించారు. జూలూరి తిరుపతి గుప్తా, సులోచనమ్మ, అనిల్‌కుమార్, రాకేష్, సుధాకర్, శైలజ, రాధిక, స్వర్ణ పాల్గొన్నారు.

అంబర్‌పేట, (ఆంధ్రజ్యోతి)